క్లుప్తంగా

యు డైస్ ప్లస్ ప్రొఫార్మాలో సమాచారం పక్కాగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సామల సింహాచలం

బలిజిపేట: పాఠశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యు డైస్ ప్లస్ ప్రొఫార్మాలో పక్కాగా ఉంచాలని ఎంఈఓ-1 సామల సింహాచలం కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖా కార్యాలయం వద్ద ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. పాఠశాలలకు సంబంధించిన వసతులు, మౌలిక సదుపాయాలు, ఇంకా అవసరమైన వసతులు వంటి సమాచారాన్ని సంపూర్ణంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పొందుపరచాలని సూచించారు. దీని ఆధారంగా భవిష్యత్తులో పాఠశాలలకు అందించాల్సిన వాటిని అందించగలమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనుస్సు పరిశీలన



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎంఓ

పార్వతీపురంటౌన్: మండలంలోని ఎమ్మార్నగరం గ్రామంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనుస్సు టీకా కార్యక్రమాన్ని డబ్ల్యూహెచ్ఓ ఎస్ఎంఓ డాక్టర్ జాన్ జూడ్ జాషువా, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.జగన్మోహన్‌రావులు బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా టీకా కేంద్రంలోని రికార్డులు, టీకా కార్డులు, వ్యాక్సిన్, అత్యవసర మందుల కిట్లను పరిశీలించి టీకా మార్గదర్శకాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో చెక్‌లిస్టు ప్రకారం తెలుసుకున్నారు. టీకా వేసిన పిల్లల వివరాలు, వారి వయస్సు పరిశీలించి యూవిన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని ఈ శనివారం వరకు కొనసాగించాలని ఇంకా టీకాలు వేయాల్సిన పిల్లలు, గర్భిణులకు వేయడానికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటనాయుడు, ఏఎన్ఎం పోలమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే పోటీలు



పట్టా అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సారికలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా పరికరాలను క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 ఏళ్లు పైబడిన వారందరికీ కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సారిక రెవెన్యూ పరిధిలో సుమారు 42 ఎకరాలకు సంబంధించి 20 మంది రైతులకు ఫ్రీహోల్డ్ పట్టాలను అందజేశారు.

టీడీపీ నాయకులకు గిరిజనుల సంక్షేమం పట్టదు..



సాలూరు: సారికలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

• మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ నాయకులకు గిరిజనుల ఓట్లు కావాలే తప్ప వారి సంక్షేమం పట్టదని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర విమర్శించారు. మండలంలోని సారికలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, తాను గిరిజనుడిని కాబట్టే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. టీడీపీ హయాంలో గిరిశిఖర గ్రామాల్లో ఒక్క బీటీ రోడ్డు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రైతులు, యువత, మహిళలు, చిన్నారులకు మోసం చేశారని ఆరోపించారు. నేడు మరలా అవే మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తున్నారని, వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఆంధ్రా - ఒడిశా వివాదాస్పద సరిహద్దు కొటియా గ్రూప్ గ్రామాల వివాదాన్ని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సామరస్య వాతావరణంలో పరిష్కరించుకునేందుకు చూస్తున్నారని తెలిపారు. ఇటీవల తాను ఒడిశాకు చెందిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మాట్లాడానని చెప్పారు.

ముఖ్యమంత్రిని మరోసారి దీవించండి..

పాచిపెంట: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. మండలంలోని రాయిగుడ్డివలస సచివాలయం పరిధిలో స్థానిక సర్పంచ్ చింత సీతయ్య అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం పరిధిలో వివిధ లబ్ధిదారులకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే జగన్ మోహన్ రెడ్డి నాయకత్వం అవసరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్, ఎంపీటీసీ సభ్యుడు దండి ఏడుకొండలు, సర్పంచ్ కొరాడ బుచ్చిబాబు, నాయకులు చంద్రయ్య, తమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ శతశాతం పూర్తిచేసేలా చర్యలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శతశాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పలు సచివాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్క కుటుంబాన్ని కలిసి సర్వే కార్యక్రమం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు కోరాడ శ్రీనివాసరావు, సువ్వాడ లావణ్య, ఏఎంసీ డైరెక్టర్ గోగు గాయత్రి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పాచిపెంట: వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రమీల, తదితరులు



సీతానగరం: ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు తిలకం దిద్దుతున్న మహిళలు

సంక్షేమ పాలనకు పట్టం కడదాం

బలిజిపేట: ముఖ్యమంత్రిగా సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని అందువలన ఆయనకే ప్రజలు పట్టం కట్టి మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ బలిజిపేట మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని నూకలవాడ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏఓ భానుమూర్తి, సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, కె.వెంకటరమణ, ఎ.రామారావునాయుడు, యు.అప్పారావునాయుడు, ఎస్.గౌరునాయుడు, కె.అప్పలనాయుడు, ఎ.పోలినాయుడు మాస్టారు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బలిజిపేట: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నాయకులు

సంక్షేమ పథకాలతోనే ప్రజలకు మేలు

సీతానగరం: మండలంలోని చినభోగిలి సచివాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుంటున్న వారంతా రానున్న ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామాలకు కొన్ని పార్టీలకు చెందిన నాయకులు ఇళ్లకు వచ్చి మాయమాటలు చెబుతారని వాటిని నమ్మవద్దని హితవు పలికారు. అనంతరం జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, సర్పంచ్ కురమానరాధ, సచివాలయ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ జి.బుజ్జి, పార్టీ మండల అధ్యక్షుడు బి చిట్టిరాజులతో కలిసి అభివృద్ధి సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఎమ్మెల్యే జోగారావు ఆవిష్కరించారు. అనంతరం వందలాది మంది అభిమానులతో కలిసి సచివాలయం నుంచి రాష్ట్ర రహదారిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండా ఆవిష్కరణకు ఎమ్మెల్యే జోగారావు వెళ్తున్న సమయంలో ప్రజలు ఎమ్మెల్యేకు మహిళలు కుంకుమ దిద్ది పాదయాత్రగా ఆయనతో పాటు వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, తహసీల్దార్ ఎన్‌వీ రమణ, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు ఈశ్వరనారాయణ, చినభోగిలి ఉపసర్పంచ్ జి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ టి.వెంకటప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కె రత్నాకర్, ఆర్వీ పార్థసారథి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల ముంగిటకు సేవలు

• ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: గ్రామ, వార్డు సచివాలయాలతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరువవుతున్నాయని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని సారికలో సుమారు 35 లక్షల రుపాయలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థతో సాకారమైందన్నారు. పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె సావిత్రి, ఎంపీడీఓ పార్వతి, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు బి.ప్రమీల, ప్రజాప్రతినిధులు గొర్లె రాజారావు, పాస్టర్ సువార్తరావు, అమల, పీడిక సుదర్శనదొర, కొండపల్లి సింహాచలం, రామకృష్ణ, నెమలపురి వెంకటరమణ, వెలుగు ఏపీఎం సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



సొంపిగాం వంతెన పనులు పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సొంపిగాం వంతెన పనుల పరిశీలన

మండలంలోని సొంపిగాం వద్ద సువర్ణముఖి నదిపై సుమారు 3 కోట్ల 87 లక్షల రూపాయలతో పీఆర్ ప్రాజెక్ట్ ద్వారా నిర్మిస్తున్న వంతెన పనులను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఎస్ఈ కృష్ణాజీని అడిగి తెలుసుకున్నారు.త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



గుచ్చిమి ఆర్బీకేలో రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ డివిజనల్ అధికారి కె హేమలత

సీతానగరం: మండలంలోని రైతుభరోసా కేంద్రాల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీఓ కె.హేమలత సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సీతానగరం మండలంలోని గుచ్చిమి రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ధాన్యం సేకరణపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మండలంలోని రైస్ మిల్లర్లు తీసిన బ్యాంక్ గ్యారంటీల ప్రాప్తిగా ఇంతవరకూ రైతుల నుంచి 1887.24 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆర్బీకేల ద్వారా సేకరించినట్లు చెప్పారు. ఈక్రాప్ బుకింగ్ చేసిన రైతులనుంచి వారు ఉత్పత్తి చేసిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. మొదటిగా ధాన్యం విక్రయాలు చేసిన రైతుల బ్యాంక్ ఖాతాలకు బిల్లులు జమ అవుతున్నాయని బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అవినాష్, పీఏసీఎస్ సీఈఓ ఆర్.అప్పలనాయుడు, రైతుభరోసా కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

డీ పట్టా భూముల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

మండలంలోని రెవెన్యూ లెక్కల ఆధారంగా ప్రభుత్వ భూములతో పాటు 'డీ పట్టా భూములను వీఆర్వోలంతా గుర్తించి ఆన్‌లైన్‌లో నిక్షిప్త పర్చాలని ఆర్డీఓ కె.హేమలత ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆమె తహసీల్దార్ ఎన్‌వీ రమణ అధ్యక్షతన ప్రభుత్వ, డీపట్టాలున్న భూముల గుర్తింపుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్వోలు రైతులకు చెందిన జిరాయితీ భూములు,పేదలకు జీవనోపాధి కోసం ఇచ్చిన డీ పట్టా భూములు, ప్రభుత్వ భూముల గుర్తింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అసలైన రైతులు నష్టపోకుండా రెవెన్యూ రికార్డుల ఆధారంగా రైతుకు భూమి ఏవిధంగా సంక్రమించిందో రికార్డులను పరిశీలించాలని సూచించారు. అసలైన రైతులకు నష్ట వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ పి.చిట్టెమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

సీతానగరం: మండలంలోని పాపమ్మవలస రైతు కళ్లంలో బస్తాలతో ఉన్న ధాన్యం, కొనుగోలు కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. ధాన్యం విక్రయ సమయంలో ఏవైనా సమస్యలున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ మండలంలోని 2,556 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసామని ధాన్యం తరలింపు విషయంలో సమస్య రాలేదని ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్‌కు ఏఓ ఎస్.అవినాష్ వివరించారు. అలాగే ధాన్యం విక్రయించిన రైతులకు కళ్లం నుంచి ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లో బ్యాంక్ ఖాతాలో బిల్లులు జమవుతున్నాయని తెలియజేశారు. లోకల్‌లో 30 ట్రాక్టర్లు వరకూ జీపీఎస్ చేసి రైతులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రస్తుతం రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తచర్యగా ట్రాక్టర్లు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితాకు సహకరించాలి

కచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి బీఎల్వోలు చేస్తున్న సమగ్రమైన దర్యాప్తునకు అందరూ సహకరించాలని ఆర్డీఓ కె.హేమలత కోరారు. ఈ మేరకు మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం బూత్ స్థాయి అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ హేమలత మాట్లాడుతూ మండలంలో డిసెంబర్ 9వ తేదీవరకూ ఓటరు జాబితాలో క్లెయిమ్‌లు అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తులు డిసెంబర్ 26 నాటికి పరిష్కరించాలని సూచించారు. 2024 జనవరి 1 నాటికి ఓటర్ల ఫైనల్ జాబితాను తయారు కానున్నట్లు చెప్పారు. ఫైనల్ పబ్లికేషన్ జనవరి 5వ తేదీన ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ రమణ పాల్గొన్నారు.

వెనుక బడిన విద్యార్థులను గుర్తించాలి



రైతులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్

పార్వతీపురంటౌన్: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పూర్తిస్థాయిలో తర్ఫీదునివ్వాలని, పదోతరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏఎంఓ, ఏటీడబ్ల్యూఓ, హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ 2024లో శతశాతం ఫలితాలే లక్ష్యంగా చేసుకుని ఐటీడీఏ స్థాయిలో సబ్జెక్టు రిసోర్స్ గ్రూప్ (ఎస్ఆర్‌జీ)ద్వారా 60రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పదోతరగతికి సంబంధించిన సబ్జెక్టు టీచర్లు సంబంధిత సబ్జెక్ట్ యాక్షన్ ప్లాన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం స్లిప్ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాల రివిజన్‌ను నిర్వహించి, చిన్న సమాధాన ప్రశ్నలు, బిట్‌లను విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో అందుబాటులో ఉన్న మోడల్ పేపర్లపై దృష్టి కేంద్రీకరించి ఎప్పటికప్పుడు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 100 మంది చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, దోల బాబ్జీ

సాలూరు: పాచిపెంట మండల కేంద్రానికి చెందిన 30 కుటుంబాల నుంచి వంద మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సాలూరులోని మంత్రి పీడిక రాజన్నదొర స్వగృహం వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోల బాబ్జీ ఆధ్వర్యంలో వీరంతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి రాజన్నదొర వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరూ సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో యజ్జల చినగోవిందరావు, కె.శ్రీనివాసరావు, గొంప అనిల్‌కుమార్, బి.విద్యాసాగర్, బి.వెంకటేష్, నారాయణరావు, విజయ్‌కుమార్, చినతల్లి, ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సాలూరు మండల వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అవగాహన ఉండాలి



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి సుధాకరరావు

పార్వతీపురంటౌన్: విద్యార్థులు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండి చుట్టుపక్కల వారిని చైతన్యవంతులను చేసి ప్రమాదాలు నియంత్రించవచ్చునని పార్వతీపురం అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణమయ్యే గాలి, మండే పదార్థం, వేడిలో ఒక దానిని అదుపు చేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేశారు. ఇళ్లలో వంట గ్యాస్ ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలి, నియంత్రించాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, డి.గోపీమోహన్ కుమార్, టి. త్రినాథ, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక శాఖాధికారి సుధాకరరావు అన్నారు. పట్టణ శివారులో గల అశోక్ లేలాండ్ వర్క్‌షాపు వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌లో రిపేర్లు చేస్తున్నప్పుడు, షార్ట్‌సర్క్యూట్, తదితర కారణాలతో ఏర్పడే అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖాధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం, నాగరాజు, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపాడ్యమి పూజలు



బలిజిపేట: గలావల్లిలో శివాలయం వద్ద పాడ్యమిపూజలు జరిపిస్తున్న అర్చకులు



చెరువుల్లో మహిళలు విడిచిపెట్టిన దీపాలు

బలిజిపేట: కార్తీకమాసం చివరిరోజున పోలిపాడ్యమి పూజలను గ్రామాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామున లేచి చెరువులు, కాలువలలో అరటిదొప్పలలో దీపాలను వెలిగించి కార్తీకదామోదరుడికి సమర్పించి కార్తీకమాసానికి వీడ్కోలు పలికారు. గడిచిన సోమవారం నాల్గవ వారం కార్తీక మాసం చివరిఘట్టం కావడం, బుధవారం పోలిపాడ్యమి జరగడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కొన్ని గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

పార్వతీపురంటౌన్: పోలిపాడ్యమిని పురస్కరించుకుని పట్టణంలో, మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నదులు, చెరువులలో తెప్పలలో దీపాలు విడిచిపెట్టారు. పట్టణంలోని అగ్రహారం, బెలగాం శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.



బలిజిపేట: స్వామివారి ప్రసాదం తీసుకుంటున్న భక్తులు

అనంతరం భక్తులు అర్చకులకు దీపదానం చేసి కార్తీకమాసం మొక్కులు చెల్లించుకున్నారు.





పార్వతీపురం టౌన్: ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న మహిళలు, దీపదానం చేస్తున్న భక్తులు



అగ్రహారం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గాంధీజీకి అంగన్‌వాడీల వినతిపత్రం



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు

సీతానగరం: తమసమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండో రోజు అంగన్వాడీ సిబ్బంది ధర్నా జరిగింది. తమ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వానికి సద్బుద్ధి కలిగేలా గాంధీజీ దీవించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జీవీ రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి రామలక్ష్మి, మండలనాయకురాలు శైలజ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



పోలింగ్ కేంద్రాల్లో వసరులను పరిశీలిస్తున్న ఎంఈఓ ఎం వెంకటరమణ, ఏఎస్సై ఎల్ శ్రీనివాసరావు

సీతానగరం: ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు మౌలిక సదుపాయాలను యాప్‌లో మ్యాపింగ్ చేయనున్నామని ఎంఈఓ-2 ఎంవీ రమణ అన్నారు. ఎంఈఓ-2 ఎం విరమణ, ఏఎస్సై ఎల్ శ్రీనివాసరావులు మండలంలోని కాశీపేట, అంటిపేట, లచ్చయ్యపేట, రామవరం, రెడ్డివానివలస, ఆర్.వెంకంపేట పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఓటింగ్‌లో పాల్గొనే వారికి కల్పించాల్సిన వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తాజాగా అక్కడ ఉన్న వనరులను పరిశీలించి భవిష్యత్‌లో కల్పించాల్సిన వనరులపై ఆరాతీశారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తయారుచేసిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.